క్లుప్తంగా

చెర్లోపల్లి వాసికి ఉగాది పురస్కారం



అవార్డు అందుకున్న సత్యనారాయణ

త్రిపురాంతకం: సామాజిక, వైద్య రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మండలంలోని చెర్లోపల్లికి చెందిన పరిటాల సత్యనారాయణ ఉగాది పురస్కారం అందుకున్నారు. ఆదివారం పల్నాడు జిల్లా నరసరావుపేటలో మన కళాక్షేత్రం ఫౌండేషన్ అండ్ విశ్వాట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కార మహోత్సవం సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ఉత్తమ సేవారత్న అవార్డు అందజేశారు.

అర్చకుల మధ్య వివాదం

- పట్టించుకోని ఆలయ అధికారులు

తాళ్లూరు: భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాల్సిన అర్చకుల మధ్య వివాదం చోటు చేసుకున్న సంఘటన జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గుంటి గంగమ్మ దేవస్థానం సన్నిధిలో ఆదివారం చోటుచేసుకుంది. భక్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటి గంగమ్మ దేవస్థాన అర్చకులు రొటేషన్ పద్ధతిలో వారి డ్యూటీలు చేస్తుంటారు. కానీ, గంగమ్మ జాతర సందర్భంగా డ్యూటీ విషయంలో ఆలయ అధికారులు అర్చకుల రొటేషన్ పద్ధతిని మార్పు చేశారు. ఒక అర్చకుడికే జాతర జరిగే మూడు రోజులు అవకాశం ఇవ్వాలంటూ ఆలయంతో సంబంధం లేని బయట వ్యక్తి అర్చకుడితో గొడవ పడటం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంలో ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, సమస్యను పరిష్కరించడంలో విఫలమైనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. గంగమ్మ జాతర సమయంలో ఇలాంటి వివాదాలు ఏంటని ఆలయానికి వచ్చిన భక్తులు వాపోతున్నారు.

కేజీబీవీలో వంద శాతం ఉత్తీర్ణత

కురిచేడు: మండలంలోని కేజీబీవీ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 25 మందికిగానూ అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.పద్మావతి తెలిపారు. వీరిలో షేక్ నౌషియా 960/1000 మార్కులు, టీ నందిని 948 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం విద్యార్థినులు 32 మందికిగానూ 30 మంది ఉత్తీర్ణత సాధించగా, షేక్ మేహరున్నీసా 479/500, గజ్జెల నాగమల్లీశ్వరి 457/500 మార్కులు సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

అన్నదాన సత్రానికి రూ.26 వేల వితరణ



అన్నదాన సత్రానికి విరాళాన్ని అందజేస్తున్న గుమ్మా యల్లేష్

పెద్దదోర్నాల: జిల్లాలోని రాచర్ల మండలం నెమలిగుండ్ల రంగస్వామి దేవస్థానం తిరునాళ్లను పురస్కరించుకుని గోపాలకృష్ణ అన్నదాన సత్రానికి రూ.26 వేల విరాళాన్ని అందజేసినట్లు మండలానికి చెందిన గుమ్మా యల్లేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉద్య కోర్ కమిటీ సభ్యులు బొమ్మనబోయిన నరేష్ యాదవ్, జిల్లా ఉద్య సభ్యులు అవులరాజు యాదవ్‌తో పాటు కాటమరాజు దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చూసుకోండిలా.. చేసుకోండిలా!



ఎండీయూ వాహనం వద్ద రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

- రేషన్‌కార్డు ఈకేవైసీ కాకపోతే రేషన్ కట్
- ఈ నెల 30వ తేదీ వరకే గడువు

పుల్లలచెరువు: ఈకేవైసీ చేయించుకోవాలి.. లేదంటే రేషన్ పంపిణీ నిలుపుదల చేస్తామని రెండు నెలలుగా అధికారులు చెబుతున్నారు. అయితే అసలు తమ రేషన్ కార్డు ఈకేవైసీ అయిందా.. లేకపోతే ఎక్కడ చేయించుకోవాలో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తొలుత గత నెల 30 వరకు ఉన్న గడువును ఈ నెలాఖరు వరకు పెంచారు. పుల్లలచెరువు మండలంలో 42 రేషన్ షాపులు ఉండగా దాదాపు 16 వేల రేషన్‌కార్డులు ఉన్నాయి. వీరిలో చాలా వరకు ఇంకా 15 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఇలాంటి వారు ఆన్‌లైన్‌లో ఈకేవైసీ స్టేటస్ సొంతంగా తెలుసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. ఆన్‌లైన్‌లో వెబ్ బ్రౌజరు లో ఈపీడీఎస్–1 అని నమోదు చేసి ఎంటర్ నొక్కాలి. అప్పుడు డిపార్టుమెంట్ ఆఫ్ కన్స్యూమర్ ఎఫైర్ అండ్ సివిల్ సప్లయిస్ ఏపీ అనే వెబ్‌సైట్ తెరుచుకుంటుంది. దానిలో డాష్‌బోర్డు ఎంపిక చేసుకోవాలి. దానిలో రేషన్‌కార్డు విభాగంగా ఆరు రకాల ఆప్షన్లు న్యూ అనే పేరుతో కనిపిస్తాయి. ఈపీడీఎస్ అప్లికేషన్ సెర్చ్ లేదా రైస్‌కార్డు సెర్చ్ అనే దానిలో ఒకదానిని క్లిక్ చేసి రేషన్‌కార్డు నంబర్ నమోదు చేస్తే అందులో ఉన్న పేర్లు వస్తాయి. అయా పేర్ల ఎదురుగా సక్సెస్ లేదా ఎస్ అని ఉంటే ఈకేవైసీ అయినట్లే. అలాకాకుండా ఏమైనా ఉంటే ఈకేవైసీ చేసుకోవాల్సిందే. డీలర్ లేదా ఎండీయూ ఆపరేటర్ వద్ద ఈపోస్ యంత్రంలో వేలుముద్ర వేసి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి. అయిదు సంవత్సరాలలోపు, 80 ఎళ్ల పైబడిన వారికి ఈకేవైసీ అవసరం లేదు. మిగిలిన వారంతా విధిగా చేయించుకోవాల్సిందే.

> **ప్రతి ఒక్కరూ త్వరగా చేయించుకోవాలి**
>
> రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఈ నెల 30వ తేదీ తుది గడువు. తరువాత ప్రభుత్వ ఆదేశాలపై రేషన్ ఇస్తారు. గ్రామాల్లోని డీలర్ వద్దకానీ, లేక ఎండీయూ ఆపరేటర్ వద్దకానీ తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలి.
>
> – రాధాకృష్ణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ తహశీల్దార్, వైపాలెం

వైభవంగా జెండాల పండుగ



పెద్దారవీడు మకాణంలో కొలువు తీరిన నాగులమీరాస్వామి పీరు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో నాగులమీరాస్వామి ఉరుసు సందర్భంగా ఆదివారం జెండాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. మకాణంలో కొలువైన పీరుకు పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేక అలంకరించారు. సాయంత్రం రైతులు ఎద్దుల బండిపై బిందెలను ఏర్పాటు చేసుకుని గ్రామంలో వీధుల్లో తప్పెట్లు, మేళాలతో ఊరేగింపుగా ఊరి చివరికి బయలుదేరి బిందెలకు మంచి నీటిని నింపుకొని అందులో బెల్లం కలిపి పానకంలా తయారు చేసి భక్తులకు పోసి మొక్కులు తీర్చుకుంటారు. అర్ధరాత్రి సమయంలో మకాణంలో కొలువు తీరిన పీరుకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామంలో ఊరేగిస్తారు. సాయంత్రం యువకులచే కోలాటం ప్రదర్శించారు.

జూనియర్ కాలేజీ టాపర్‌గా నిలిచిన బుట్టి బెన్‌హిన్‌కు సన్మానం



బుట్టి బెన్‌హిన్ సత్కరిస్తున్న క్రైస్తచర్చి పెద్దలు

పెద్దదోర్నాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థి బుట్టి బెన్‌హిన్ ఇంటర్ పలితాల్లో 951 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలవటంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ దోర్నాల మండల అధ్యక్షుడు పాల్ స్పర్జన్‌లతో పాటు క్రైస్తచర్చి పెద్దలు బుట్టి బెన్‌హిన్‌ను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. బెన్‌హిన్ తల్లిదండ్రులు అగస్టీన్, మేరీ అగస్టీన్‌లను అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పులిగుజ్జు సామేల్, మాండ్ల వెంకటేశ్వర్లు, కాటి జాషువా, ఉరవకొండ ఏలియా, మర్రి ఒనేసీమ్, బిల్లవరం బర్నబా, నర్రా వెంకటరత్నం, ఇళ్ల అంకయ్య తదితరులు పాల్గొని బుట్టి బెన్‌హిన్‌ను సత్కరించారు.

ఘనంగా మట్టల పండుగ



దొనకొండ: ఏబీఎం చర్చి ముందు హోసన్నా అని నినదిస్తున్న చిన్నారులు



దొనకొండ: మ్రానికొమ్మలతో కతోలిక క్రైస్తవులు

యర్రగొండపాలెం: మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు స్థానిక లేమేన్స్ ఇవాంజికల్ ఫెలోషిప్ ఇంటర్నేషనల్ చర్చికి చెందిన విశ్వాసులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఆ చర్చికి చెందిన బొందలపాటి హయ్యర్ జయదేవ్, జాన్సన్ ఫిన్నీ, జాన్ బన్యన్ పాల్గొన్నారు.

మట్టల ఆదివారం సందర్భంగా ర్యాలీ

త్రిపురాంతకం: మట్టల ఆదివారం సందర్భంగా పట్టణంలో విశ్వాసులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో పాస్టర్ నాని జాన్ ఘనంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన ఈత మట్టలను పట్టుకొని చిన్నారులు ర్యాలీలో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మ్రానికొమ్మల ఆదివారం

దొనకొండ: మ్రానికొమ్మల ఆదివారంను మండలంలోని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక కతోలిక క్రైస్తవులు మ్రానికొమ్మలు చేబూని దావీదు తనయా హోసన్నా.. అంటూ ఎలుగెత్తి చాటుతూ పునీత అంతోని దేవాలయంకు చేరుకున్నారు. రెవ.ఫాదర్ థామస్ ప్రార్థనలు నిర్వహించి మ్రానికొమ్మల ఆదివారం విశిష్టతను వివరించారు. సెయింట్ ఆన్స్ కాన్వెంట్ సిస్టర్స్, విచారణ కతోలిక క్రైస్తవులు పాల్గొన్నారు. బస్టాండ్ సెంటర్‌లోని ఏబీఎం చర్చిలో పాస్టర్ ప్రభుదాసు ఆధ్వర్యంలో సండే స్కూల్ చిన్నారులు, సంఘస్తులు పురవీధుల్లో ఈతమట్టలు పట్టుకుని రాజులకు రాజుకే జై.. ప్రభువుల ప్రభువుకే జై.. అంటూ నినాదాలు చేశారు. అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి సుధీర్, కోశాధికారి ఎం.కిరణ్, సండే స్కూల్ సూపరింటెండెంట్ ఎం.మరియమ్మ, కేజేఎస్ రాజు, చిన్నారులు పాల్గొన్నారు. క్రీస్తురాజు పండుగను అన్ని గ్రామాల క్రైస్తవులు ప్రార్థనా పూర్వకంగా జరుపుకున్నారు.



త్రిపురాంతకంలో ఈత మట్టలతో ర్యాలీ చేస్తున్న విశ్వాసులు



వైపాలెం బస్టాండ్ సెంటర్‌లో కీర్తనలు ఆలపిస్తున్న విశ్వాసులు

సందడిలేని నాగుల మీరాస్వామి మహోత్సవాలు

- టీడీపీ నాయకుల వర్గపోరుతో సాంస్కృతిక కార్యక్రమాలు రద్దు
- నిరుత్సాహానికి గురైన భక్తులు



భక్తులతో సందడిలేక వెలవెల పోతున్న నాగుల మీరాస్వామి దర్గా

యర్రగొండపాలెం: మండల కేంద్రమైన పెద్దారవీడులో జరుగుతున్న నాగుల మీరాస్వామి ఉరుసు మహోత్సవం మూగబోయింది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన స్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగాల్సి ఉంది. శనివారం గంధ పూజ యధావిధిగా నిర్వహించారు. ఆదివారం రాత్రి జరిగే జెండా పండుగకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అక్కడికి చేరుకున్నారు ఈ సందర్భంగా రాజకీయ పార్టీలతో పాటు దాతలు భక్తులు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయడం అక్కడి ఆనవాయితీ. స్టేజీలు ఏర్పాటు చేసుకొని సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు పాట కచేరీలు నిర్వహించుకునేందుకు టీడీపీలో ఉన్న ఇరువర్గాలకు చెందిన వారు రెండు స్టేజీలకు అనుమతి తీసుకున్నారు. ఈ రెండు వర్గాలకు చెందిన వారు నియోజకవర్గ కూటమి నాయకుడు ఎరిక్షన్‌బాబుకు చెందినవి అయినా ముందుగా తన స్టేజీ ఎక్కాలని ఒక వర్గానికి చెందిన వారు పంచాయితీ పెట్టారు. ఈ పంచాయితీ తారస్థాయికి చేరుతున్న తరుణంలో రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్రకు చెందిన మరో వర్గం తాము స్టేజీ ఏర్పాటు చేసుకోవటానికి అనుమతి ఇవ్వాలని పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయం తెలుసుకున్న కూటమి నాయకుడు రవీంద్ర వర్గానికి అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్నట్లు తెలిసింది. ముందుగా అనుమతి పొందిన రెండు వర్గాల మధ్య హోరాహోరీగా పోరు జరుగుతుంటే మూడో వర్గం వచ్చి అనుమతి అడగటంతో పోలీసులకు చిరాకు పుట్టుకొచ్చింది. ఈ వర్గపోరుతో ఉరుసు సందర్భంగా శాంతి, భద్రతలకు ముప్పు వాటిల్లే పరిస్థితి ఉందన్న ఉద్దేశంతో వారికిచ్చిన అనుమతులను పోలీసులు రద్దు చేశారు. వారితో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అనుమతిని కూడా వారు రద్దు చేయడంతో ఉరుసు ఉస్సూరుమంది. నాగుల మీరాస్వామిని దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకుందామని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నిరుత్సాహానికి గురయ్యారు. ఇది ఇలా ఉండగా తమ అనుమతికి కూటమి నాయకుడు అడ్డు పడ్డాడని ఆరోపిస్తూ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు రవీంద్ర వర్గం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎరిక్షన్‌బాబును ఆయన మందలించినట్లు ప్రచారం సాగుతోంది.

ముస్లింల నెత్తిన.. కూటమి టోపీ!

- ముస్లింల కల నెరవేరేనా..!
- అర్ధంతరంగా ఆగిన షాదీఖానా
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



అసంపూర్తిగా నిలిచిన షాదీఖానా నిర్మాణం

మార్కాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లింల అభివృద్ధిని మరిచిపోయింది. అధికారంలోకి రాకముందు ముస్లింలకు మద్దతుగా ఉంటాం.. అని అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చింది. దాంతో పాటుగా ముస్లింలకు అన్యాయం జరుగుతోందన్న వక్ఫ్ బిల్లులకు సైతం కూటమి మద్దతు పలికి ముస్లింలను నట్టేట ముంచింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.2 కోట్ల వ్యయంతో మార్కాపురం ప్రాంత ముస్లింల చిరకాల కలను నెరవేర్చేందుకు కంభం సెంటరులో షాదీఖానా నిర్మాణాన్ని చేపట్టారు. దాదాపు 70 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి. మార్చిలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం రావడంతో షాదీఖానా నిర్మాణం గత పది నెలల నుంచి అర్ధాంతరంగా నిలిచింది. రాత్రిపూట అసాంఘిక కార్యక్రమాలకు వేదికగా మారడంతో పలువురు ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం పట్టణం, మండలంలో సుమారు 15 వేల మందికి పైగా ముస్లింలు ఉన్నారు. శుభకార్యాలతో పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించు కునేందుకు శాశ్వత భవనం లేకపోవడంతో గత 20 ఏళ్లుగా షాదీఖానా కోసం ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, విభజన అనంతరం టీడీపీ ప్రభుత్వంలో షాదీఖానా నిర్మాణానికి శిలాఫలకాలు ఆవిష్కరించారే కానీ నిధులు కేటాయించలేదు.

నిధులు కేటాయించిన వైఎస్సార్ సీపీ..

అయితే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి నాటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో మాట్లాడి ప్రత్యేకంగా రూ.2 కోట్ల నిధులను కేటాయించారు. వెంటనే టెండర్లు పిలవడం, పనులు ప్రారంభించడం చకచకా జరిగిపోయాయి. ప్రస్తుత మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు కూడా షాదీఖానా నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి గతేడాది ఎన్నికలకు ముందు షాదీఖానా నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలని ఆదేశించడంతో పనులు త్వరితగతిన జరిగాయి. ముస్లింల కల నెరవేరే దశలో ఎన్నికల కోడ్ అమలులోనికి రావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ పనులు జరుగుతాయని ముస్లింలు ఆశతో ఎదురు చూశారు. 10 నెలలు కావస్తున్నా పనుల్లో పురోగతి లేదు. దీనితో షాదీఖానా నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది.

షాదీఖానా పూర్తయితే..

షాదీఖానా నిర్మాణం పూర్తయితే మార్కాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాలైన వేములకోట, చింతగుంట్ల, తిప్పాయిపాలెం, నికరంపల్లి, దరిమడుగు, రాయవరం, గజ్జలకొండ, ఇడుపూరుతోపాటు తర్లుపాడు పెద్దారవీడు మండలాల ముస్లింలందరికీ కూడా వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునేందుకు ఉపయోగపడుతుంది. ప్రస్తుతం షాదీఖానా లేకపోవడంతో ముస్లింలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అత్యధిక రెట్లు చెల్లించి పట్టణంలో ప్రైవేటు ఫంక్షన్ హాల్స్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఇది పూర్తయితే తక్కువ అద్దెతో వివిధ కార్యక్రమాలు నిర్వహించుకునే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా షాదీఖానా నిర్మాణాన్ని పూర్తిచేయాలని ముస్లింలు కోరుతున్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

అపూర్వం పూర్వ విద్యార్థుల కలయిక



వేదికపై పూర్వ విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు

కొమరోలు: మండలంలోని గోపాలునిపల్లె ఏబీఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999–2000 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా 25 ఏళ్ల తరువాత నిర్వహించిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పూర్వ విద్యార్థులు కలుసుకుని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పాల్గొన్న నాటి విద్యార్థులు తమ బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కొద్దిసేపు ఆటపాటలతో అప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో గంగమ్మ జాతర నిర్వహించాలి

తాళ్లూరు: మండలంలోని గుంటిగంగలో గంగమ్మ జాతరను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ సూచించారు. గంగమ్మ దేవాలయ సన్నిధిలో మండల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. సీఐ వై.రామారావు, ఎస్సైలు ఎస్.మల్లికార్జునరావు, కమలాకర్, మురళితో పాటు ఆలయ కమిటీ సభ్యులు, మండల నాయకులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌లో బెట్టింగ్ యాప్‌లు ఉంటే చర్యలు



సెల్‌ఫోన్‌లను పరిశీలిస్తున్న ఎస్సై సైదుబాబు

మార్కాపురం: సెల్‌ఫోన్‌లో బెట్టింగ్ యాప్‌లు ఉంటే వెంటనే వాటిని తొలగించాలని ఎస్సై సైదుబాబు తెలిపారు. ఆదివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేసి పలువురి సెల్‌ఫోన్‌లను తనిఖీ చేశారు. ఎవరైనా ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవటంతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. గంజాయి అమ్మినా, తాగినా వారిపై కూడా కేసు నమోదు చేస్తామన్నారు. పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాలను తరచుగా పరిశీలిస్తున్నామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పలువురి సెల్‌ఫోన్‌లలో ఉన్న బెట్టింగ్ యాప్‌లను ఆయన తొలగించారు.

రంగనాయకస్వామికి అన్నా పూజలు



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు

రాచర్ల: నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన శ్రీదేవి, భూదేవి సమేత నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణానికి వచ్చిన గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అన్నా వెంకట రాంబాబు, సతీమణి దుర్గాకుమారిలకు ఆలయ అర్చకులు స్వామివారి పట్టువస్త్రలతో సత్కరించి, తలంబ్రాలను అందజేసి ఘన సన్మానం చేశారు. అనంతరం స్వామివారి ఆలయానికి చెరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులను పొందారు. కార్యక్రమంలో దేవస్థాన మాజీ చైర్మన్ కన్నసాని ఓబులేసు, అనుములపల్లె సర్పంచ్ సిరిగిరి రమేష్, చోళ్లవీడు మాజీ సర్పంచ్ ముత్యాల మధుసూదనరావు పాల్గొన్నారు.